సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024

మేము సిద్ధం : సీఎం ప్లకార్డులతో అభిమానులు



ఆధ్యాత్మిక గుబాళింపు



యాగశాలలో రాజశ్యామల అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్



అమ్మవారి దీక్షా పీఠంలో పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు

- వైభవంగా రాజశ్యామల యాగం
- క్రతువులో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- దాదాపు రెండున్నర గంటలపాటు పూజాది కార్యక్రమాల నిర్వహణ
- సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అశేష జనవాహిని
- ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడిన సీఎం

పెందుర్తి: జగన్మాత సన్నిధిలో సర్వప్రాణి శ్రేయస్సు కోసం తలపెట్టిన రాజశ్యామల హోమంతో ఆధ్యాత్మికత గుభాళించింది. ఆ ఆధ్యాత్మిక క్రతువుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై భక్తజనంతో పాటు పండిత పెద్దలు.. వేద విద్యార్థులతో మమేకమై ఆత్మీయంగా పలకరించడంతో ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం పులకించింది. చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో బుధవారం సందడి నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముగింపు వేడుకలకు హాజరై దాదాపు రెండున్నర గంటలపాటు పీఠ ప్రాంగణంలోని వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉట్టిపడిన ఆధ్యాత్మికత

రాజశ్యామల యాగంతో బుధవారం ఉదయం నుంచి శ్రీశారదా పీఠం వేదఘోషతో మార్మోగింది. మధ్యాహ్నం 12.27 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఠానికి చేరుకున్నారు. పీఠం ఆనవాయితీ ప్రకారం వేదపండితులు సీఎంకు సాదరస్వాగతం పలికారు. సంప్రదాయ వస్త్రధారణలో జగద్గురు సన్నిధిలోకి ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలను కలుసుకుని అభివాదం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం స్వామీజీలు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డితో కలిసి పీఠం అనుష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి విశేష పూజలు జరిపారు. సుబ్రహ్మణ్యస్వామి, దాసాంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. జమ్మిచెట్టుకు ప్రదక్షిణ చేశారు. రాజశ్యామల యాగం పూర్ణాహుతిలో సీఎం పాల్గొని అద్వితీయ ఘట్టాన్ని ఆద్యంతం తిలకించారు. యాగ భస్మాన్ని స్వామీజీ స్వయంగా సీఎం వైఎస్ జగన్ నుదుట దిద్దారు. వేదపండితులకు సత్కారం చేశారు. పలువురు వేద విద్యార్థులను ముద్దు చేసి ఉత్సాహం నింపారు. సన్నిధానంలో స్వామీజీతో సీఎం పలు అంశాలపై చర్చించారు. ఇరువురు స్వామీజీలు సీఎంను ఘనంగా సత్కరించి శంకరాచార్యుల ప్రతిమను అందజేశారు.



జమ్మి చెట్టుకు మొక్కుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు శుభాకాంక్షలు

పీఠానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. అదీప్‌రాజ్ జన్మదినం కావడంతో సీఎం ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు అందించారు. అదీప్‌రాజ్ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు.



నటరాజ స్వామికి పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్

పీఠ ప్రాంగణంలో సందడి

ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగోసారి పీఠానికి వచ్చారు. ఆయనతోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల రాకతో పీఠం ప్రాంగణంలో సందడి నెలకొంది. పీఠానికి వచ్చే సాధారణ భక్తులతో పాటు సీఎంను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో శారదా పీఠం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భద్రతా కారణాల రీత్యా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు పీఠం తరఫున ప్రసాద వితరణ చేపట్టారు.



అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

దారి పొడుగునా నీరాజనం



అదిగో మన జగనన్నా..



ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం జగన్

- సీఎం జగన్‌కు ఘనస్వాగతం పలికిన ప్రజలు
- శారదా పీఠం వరకు రోడ్డుకిరువైపులా సిద్ధం ప్లకార్డుల ప్రదర్శన
- ప్రజలకు అభివాదం చేస్తూ మెల్లగా కదిలిన సీఎం

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విశాఖ పర్యటనలో ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. బుధవారం విశాఖ శ్రీ శారదా పీఠంలో పూర్ణాహుతిలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు నీరాజనాలు పలికారు. తమ అభిమాన నేతను చూసేందుకు దారి పొడవునా అభిమానులు ఆసక్తి ప్రదర్శించారు. ఎండను సైతం లెక్కచేయకుండా గంటలకొద్ది వేచియుండి ఆయనపై ఉన్న అభిమానాన్ని, కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. పలు చోట్ల రోడ్డు మీదకు దూసుకువచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు.. కారులో ఉన్న సీఎంతో సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించారు. ముందుకు వస్తున్న అభిమానులు, పార్టీ కార్యకర్తలను అదుపు చేయడం పోలీసులకు కత్తి మీద సాములా మారింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఓపికతో నిలబడి ప్లకార్డులు, జెండాలు ప్రదర్శిస్తూ తమ అభిమాన నేతకు ఘన స్వాగతం పలికారు. పలు చోట్ల తీన్‌మార్లు, తప్పెటగుళ్ల కళాకారులు ప్రదర్శనలు చేశారు.



సంక్షేమ సారథికి కృతజ్ఞతా వందనం

వైఎస్సార్ సీపీలోకి జనసేన నాయకురాలు



విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో 61వ వార్డు జనసేన సీనియర్ నాయకురాలు మునంపాక నాగమణి, అప్పారావు దంపతులు సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

న్యూస్‌రీల్

మత్స్యగుండం ముఖద్వారం ప్రారంభం



మత్స్యగుండం ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: మత్స్యలింగేశ్వర సమగ్ర అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ శైవక్షేత్రం మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మించిన ముఖ ద్వారాన్ని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ బుధవారం ప్రారంభించారు. రూ.5.50 లక్షల వ్యయంతో నిర్మించిన కట్టడానికి సంబంధించి శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనతంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ శాంతకుమారి, ఆలయకమిటీ సభ్యులు చంద్రశేఖర్‌నాయుడు, మత్స్యకొండబాబు, పాత్రుడు, చిట్టిబాబు, కేశవరావునాయుడు, బీంబాబు, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా పాండవుల విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన పాండవుల విగ్రహాలు

సాక్షి,పాడేరు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న కొండపై నిర్మించిన పంచ పాండవుల ఆలయాన్ని గుడివాడ గ్రామ గిరిజనులు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన శంకులమ్మతల్లి ఆలయ పూజారి, గ్రామపెద్ద బిమ్మలపూజారి సింహాచలం సొంత నిధులు రూ.3 లక్షలతో ద్రౌపది సమేత పంచ పాండవుల ఆలయాన్ని నిర్మించారు. దీనిలో భాగంగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీగా అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు



ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ విజయ సునీతకు వివరిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



తహసీల్దార్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ సునీత

- కలెక్టర్ విజయ సునీత
- అరకులోయలో స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

అరకులోయ టౌన్: సార్వత్రిక ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయ సునీత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.ఆరు మండలాలకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని అరకు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాడేరు పీవో అభిషేక్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి మరో 15 రోజుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. సెక్టార్, రూట్ అధికారులకు ఇప్పటివరకు రెండు దఫాలు శిక్షణ ఇచ్చామని, మళ్లీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అరకు అసెంబ్లీ పరిధిలో 16 అత్యంత సమస్యాత్మక, 100 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ సజావుగా జరిగేలా పోలీసు శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. అల్లూరి జిల్లాకు కలెక్టర్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. భౌగోళికంగా జిల్లా చాలా పెద్దదన్నారు. గతంలో మొట్టమొదట ఏజెన్సీ ప్రాంతంలో పనిచేశానన్నారు. ఈ ప్రాంత ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఎంతో నచ్చాయన్నారు. జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎంపీడీవో వెంకటేస్, టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాలరావు, ఏఈఈ అభిషేక్, ఈవోపీఆర్‌డీ ఎల్. వెంకటరావు, ఈవో రాజశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏవోబీ అందాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలం

సినీ నిర్మాత రాజీవ్‌రెడ్డి



రాజీవ్‌రెడ్డితో కోడైరెక్టర్ రమణ, విలన్ శివ


ముంచంగిపుట్టు: ఏవోబీ సరిహద్దు ప్రాంతాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమని ప్రముఖ సినీ నిర్మాత రాజీవ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అధినేత రాజీవ్‌రెడ్డి నిర్వహణలో అనుష్కశెట్టి, విక్రమ్‌ప్రభు హీరో హీరోయిన్లుగా క్రిష్ దర్శకత్వంలో సినిమాను ఆయన చిత్రీకరిస్తున్నరు. ఇటీవల ఒడిశాలోని కోరాపుట్, జయపురం, దేవ్‌మాళి, కొల్లాబ్, అపర్‌కొల్లాబ్ తదితర ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఈనేపథ్యంలో బుధవారం మాచ్‌ఖండ్ ప్రాంతాన్ని కోడైరెక్టర్ రమణ జాగర్లమూడి, విలన్ శివతో కలిసి ఆయన సందర్శించారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం, డుడుమ జలపాతం, వించ్ హౌస్ ప్రాంతాలల్లో ప్రకృతి అందాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నెలవైన ఏవోబీ సరిహద్దు ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ పూర్తి చేశామన్నారు. రెండో షెడ్యూల్‌ను ఏప్రిల్ నెలలో వారం రోజులపాటు మాచ్‌ఖండ్, డుడుమ, బలడ హిల్‌టాప్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామన్నారు. కృష్ణం వందే జగద్గురం, గౌతమిపుత్ర శాతకర్ణి, కొండపొలం, కంచె సినిమాలకు ఈయన నిర్మాణగా వ్యవహరించారు.

నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు రేపు

చింతపల్లిరూరల్: ఉపాధి హామీ పథకంలో 2018 నుంచి ఇప్పటి వరకు వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలో నిరుద్యోగులుగా ఉన్న యువతీ యువకులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వీరసాయిబాబు తెలిపారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన టెన్త్, ఆపై విద్యార్హత కలిగి, 19 సంవత్సరాల నుంచి 30 ఏళ్లలోపు వయసు గల యువతీ యువకులు ఇంటర్వ్యూల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. అర్హత సాధించిన వారికి వివిధ రకాల నైపుణ్య కోర్సులు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో వారికి ఉచిత వసతి, భోజనం, సౌకర్యాలు కల్పిస్తారని. ఆసక్తి గల వారు చింతపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు హెచ్చరిక



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మజీరావు

డుంబ్రిగుడ: ఉపాధ్యాయులు విధులపట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,ఎంఈవో కార్యాలయాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. బోధన సక్రమంగా చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇప్పటినుంచి పూర్తిస్థాయిలో బోధన అందిస్తే టెన్త్‌లో మంచి ఫలితాలు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ రోజు పాఠశాలల్లో పర్యవేక్షణ ఉండాలని ఎంఈవో సుందర్‌రావును ఆదేశించారు. సీఆర్పీలు పద్మ, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులకు సత్వర వైద్యం

వెంటనే స్పందించిన పాఠశాలల యాజమాన్యాలు



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థి మన్మథరావు

ముంచంగిపుట్టు: అస్వస్థతకు గురైన విద్యార్థినులకు సత్వర వైద్యం అందేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. బూసిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న చిక్కుడు మన్మథరావు బుధవారం ఫిట్స్ వ్యాధి కారణంగా కిందపడిపోయాడు. వెంటన హెచ్‌ఎం మన్మథరావు, వార్డెన్ మోహన్ 108 వాహనంలో హుటాహుటిని స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వెంటనే వైద్యసేవలు అందించారు. ఆరోగ్యపరిస్థితి బాగానే ఉందని వారు తెలిపారు. ఇలావుండగా స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–2లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏ.శ్రీదేవి కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ స్వగ్రామం గాదెలబురుగు వెళ్లిపోయింది. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం రాధాకృష్ణ, వార్డెన్ రత్నకుమారి బుధవారం ఆమె వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి శ్రీదేవిని స్థానిక సీహెచ్‌సీకి తీసుకురావడంతో వైద్యులు వెంటనే చికిత్స అందించారని ఏటీడబ్ల్యూవో స్వర్ణలత తెలిపారు.

కుమ్మరిపుట్టు విద్యార్థిని కేజీహెచ్‌కు తరలింపు

పాడేరు : పట్టణంలోని కుమ్మరిపుట్టు గిరిజన గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పాంగి భువనేశ్వరి బుధవారం సాయంత్రం కడుపునొప్పి కారణంగా తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో పాఠశాల యాజమాన్యం ఆమెను హుటహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు అపెండిసైటస్‌గా నిర్ధారించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు 108లో ఆమెను విద్యార్థుల తల్లిదండ్రులు, హౌస్ టీచర్, ఏఎన్‌ఎం సహకారంతో కేజీహెచ్‌కు తరలించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థులకు బోధిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందజేస్తున్న పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండలంలోని సాగరలో రూ.5.9 లక్షలతో మరమ్మతులు చేపట్టిన పాఠశాల భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. వారితో కాసేపు ముచ్చటించారు. బిస్కెట్లు, చాకెట్లు అందజేశారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల్లో బడిఈడు పిల్లలు బయట ఉండకూడదన్నారు. ఉండకూడదన్నారు. విద్యతోనే భవిష్యత్తు సాధ్యమని, ప్రతిరోజు పిల్లలను స్కూల్‌కు పంపించేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, సర్పంచ్ తౌడమ్మ, ఎంపీటీసీ దేవదాసు, ఎంఈవో సుందరరావు, టీడబ్ల్యూ ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి పుష్పయాగం

ఎంవీపీ కాలనీ (విశాఖ): స్థానిక సెక్టార్-6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రత్తాళ్వార్‌తో భక్తుల అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానం చేసి తరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శ్రీవారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పుష్పాలు తొలుత స్వామి వారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

హుషారుగా ఎడ్లబళ్ల పోటీలు

చోడవరం: గోవాడలో బుధవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందేలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 23 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వీటిలో ఎం. కొత్తపల్లికి చెందిన నంబారు రామకృష్ణ ఎడ్లు విజేతగా నిలిచాయి. నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్లు ద్వితీయ, ఎం. కొత్తపల్లికి చెందిన మురికిటి లోవరాజు ఎడ్లు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. దేవరాపల్లికి చెందిన వారాది భరద్వాజ్ ఎడ్లు నాలుగు, గోవాడకు చెందిన వెలుగుల తాత ఎడ్లు ఐదు, నర్సయ్యపేటకు చెందిన బూతా తేజస్విని ఎడ్లు ఆరు, చుక్కపల్లికి చెందిన ఎం. హరికృష్ణ ఎడ్లు ఏడు, నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన రామకృష్ణ ఎడ్లు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. వీటికి ప్రోత్సాహక బహుమతులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రదానం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేత టీమ్‌కు షీల్డ్‌ను అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండర్ భగత్‌సింగ్, ఎస్ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, గిరిజన యువత చెడు వ్యసనాలు వీడి క్రీడల పట్ల దృష్టి సారించాలని సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ డిప్యూటీ కమాండర్ భగత్ సింగ్, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. ఈ క్రీడల్లో ప్రథమ విజేతగా గూపిగెడ్డ టీమ్, ద్వితీయ విజేతగా కరకపల్లి టీమ్‌లు గెలిపొందాయి. విజేత టీమ్‌లకు బహుమతులు, టీషర్టులు అందజేశారు. క్రీడల్లో ఆరు గ్రామాల వాలీబాల్ టీమ్‌లు పాల్గొన్నాయి. సీఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జి సెన్స్ రాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఎంపీ మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, శారద పీఠంలో కలిసిన ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

గ్రామ వలంటీర్ల సేవలు అద్భుతం



హుకుంపేటలో వలంటీర్లను సన్మానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యలింగం



జి.మాడుగులలో గ్రామ వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న గ్రామ వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అద్భుతమని పాడేరు ఎమ్మెల్యే, అరుకు పార్లమెంట్ ఇన్‌చార్జి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం జరిగిన గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఆమెతో పాటు అరుకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సేవా వజ్రా- ఇద్దరికి, ఐదుగురికి సేవా రత్నతో పాటు సేవా మిత్ర అవార్డులను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు నిలిచి, ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, సిఐ నాయుడు, సర్పంచ్ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఆంధ్రప్రదేశ్‌లో పాలన విధానాన్ని మార్చింది గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలేనని పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో రామాలయం ఆవరణలో బుధవారం గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు అవార్డులతో ఆమె సత్కరించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి గడపలోను సంక్షేమ పాలన అందిస్తున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న ఆలోచన విధానాలకు తగ్గట్టుగా వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను ఆమె సత్కరించి అవార్డులను అందజేశారు. 5గురికి సేవారత్న, 298మందికి సేవామిత్ర అవార్డులను ఆమె అందజేశారు. పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిదొర, చిట్టిబాబు సర్పంచ్‌లు రాంబాబు, హనుమంతరావు, కొండబాబు, జెసీఎస్ కన్వీనర్ కళ్యాణం, పీఎసీఎస్ చైర్మన్, ఎంపీటీసీ చిన్నారావు, విద్యా విభాగ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ నంబర్ అంద్రయ్య, పార్టీ కన్వీనర్లు మత్స్యరాజు, ప్రకాష్, మండల మహిళా అధ్యక్షురాలు నీలమ్మ, నాయకులు ప్రశాంత్, సోములు, రమణ, సోమలింగం, బాబూరావు, పండుదొర, డైరెక్టర్ సన్యాసినాయుడు, బాలయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



వినియోగదారుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

చింతూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పరిష్కార న్యాయస్థానం పనిచేస్తుందని చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్‌శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థ అందించాల్సిన సేవలకు నిర్దిష్ట కాలపరిమితి ఉందన్నారు.

ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తే వినియోగదారులు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. ముందుగా సంస్థకు సంబంధించిన అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని, దీంతోపాటు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు సమర్పించాలని ఆయన సూచించారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన వినియోగదారులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. వినతి పత్రాలు అందజేశారు. ఈఈ యూసఫ్, ఏడీఈ మలాకీ పాల్గొన్నారు.

గంజాయి నిందితుల అరెస్టు



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు

మోతుగూడెం: స్థానిక పోలీసు చెక్‌పోస్టు వద్ద తనిఖీలో 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి. గోపాల్‌రావు బుధవారం తెలిపారు. ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి మహారాష్ట్రకు కారులో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కారు సీజ్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 1.25 లక్షలు ఉంటుందన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ (విశాఖ) : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

కాఫీ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్

చింతపల్లిరూరల్: గిరిజన రైతులు కాఫీ సాగులో మెలకువలు పాటించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్ అన్నారు.మండల కేంద్రంలో కాఫీ బోర్డు కార్యలయంలో చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల కాఫీ రైతులు, కాఫీ కార్మిక విద్యార్థులతో కాఫీ అభివృద్ధి ప్రాజెక్టు, మధ్యంతర ప్రణాళిక కాలంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించే కాఫీని అరకు కాఫీగా పిలుస్తున్నారన్నారు. అరకు కాఫీ కి అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కాఫీ రైతులు కాఫీ సాగులో మెలకువలు పాటించకపోవడం వలన తక్కువ దిగుబడులు పొందడంతో పాటు, నాణ్యత కోల్పోతున్నారన్నారు. దీని వలన రైతులకు మంచి లాభాలు చేకూరడం లేదని, కావున రైతులు సాగులో మెలకువలను అలవర్చుకోవాలన్నారు. కేరళలో రైతులు ఎకరాకు 300 కిలోల కాఫీ దిగుబడి సాధిస్తుంటే, గిరిజన రైతులు 100 కిలోలు మాత్రమే దిగుబడి వస్తుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులకు మార్కెట్ లో మంచి ధరలు లభిస్తున్నాయన్నారు. రైతులు అధిక దిగుబడులు పెంపొందించేందుకు బేబి పల్పర్లు, డ్రైయింగ్ యార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు కాఫీ బోర్డు సేవలను సద్వినియోగం చేసుకోని అధిక లాభాలను సాధించాలని ఆయన కోరారు.ఇన్‌చార్జి జేల్‌వో ఎస్.ప్రదీప్ కుమార్, డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు పాత్రుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమణ, ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ మూర్తి, ఉద్యానశాఖ అధికారి అరుణకుమారి, మ్యాక్స్ చైర్మన్ సెగ్గి కొండలరావు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన అవసరం



అమీనాబాద్‌లో పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డీడీ అహ్మద్ షరీఫ్

రాజవొమ్మంగి: పశు వ్యాధులపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. వ్యవసాయంతో అనుబంధం ఉన్న మన పశువులను కంటికి రెప్పలా సాకాలన్నారు. ఆయన మండలంలోని అమీనాబాద్ సచివాలయంలో బుధవారం జరిగిన పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పశుసంపద తగ్గిపోతే అది వ్యవసాయంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. పాడి పశువులను సక్రమంగా పెంచక పోతే పాడి తగ్గిపోయి ఆ ప్రభావం మన ఆరోగ్యంపైనే పడుతుందని వివరించారు. పశువులకు బీమా చేయిస్తే పశు మరణాలు సంభవించినప్పుడు ఆ నష్టం పూడ్చుకొనే అవకాశం ఉంటుందన్నారు. మేలు జాతి పశువులకు ఏటా ప్రీమియం రూ. 384 కాగా నాటు ఆవులకు రూ.192 ప్రీమియం చెల్లించాలన్నారు. ఇలా బీమా పొందిన పశువు చనిపోతే ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా నష్ట పరిహారం పొందవచ్చన్నారు. పశువులకు ఇన్సూరెన్స్‌కు సంబంధించి సమీపంలో పశువైద్యులను సంప్రదించాలని కోరారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో మొత్తం ఒక లక్ష తెల్లజాతి, 40వేల నల్లజాతి (గేదెలు) పశువులు ఉన్నట్టు చెప్పారు. వీటికి అవసరమైన వ్యాక్సిన్ ఇప్పటికే అందజేసినట్టు డిప్యూటీ డైరెక్టర్ అహ్మద్ షరీఫ్ చెప్పారు. పశువులకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించుకోవాలని కోరారు. ఆయన వెంట స్థానిక వెటర్నరీ డాక్టర్ తరుణ్, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ స్థాయికి మూడు ఉన్నత పాఠశాలలు



హైస్కూల్ ప్లస్ స్థాయికి అప్‌గ్రేడ్ అయిన రాజవొమ్మంగి జెడ్పీ ఉన్నత పాఠశాల

సాక్షి,పాడేరు: జిల్లాలోని రంపచోడవరం డివిజన్ పరిధిలో మూడు ఉన్నత పాఠశాలలు హైస్కూల్ ప్లస్ స్థాయికి అప్‌గ్రేడ్ అయ్యాయి. రాజవొమ్మంగి,అడ్డతీగల మండల కేంద్రాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, దేవిపట్నం మండలంలోని ఇందుకూరుపేట గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్ స్థాయికి పెంచుతూ విద్యాశాఖ నుంచి తగిన ఉత్తర్వులు అందాయని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు 'సాక్షి'కి తెలిపారు. ఈ మూడు ఉన్నత పాఠశాలలు ఇంటర్ స్థాయికి పెరగడంతో ఈపాఠశాలల్లో టెన్త్ చదువుతున్న 200మంది విద్యార్థిని, విద్యార్థులతో పాటు వారి తల్లి దండ్రులు, ఉపాధ్యాయ వర్గాలన్నీ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు ఉత్తీర్ణులైతే ఇక్కడే ఇంటర్ చదువులకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

యువకుడి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



శీలం నరేంద్ర మృతదేహం

ఎటపాక: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాయనపేట వద్ద జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మండల పరిధిలోని నల్లకుంట గ్రామం నుంచి శీలం నరేంద్ర, పొడియం రాజేష్ ద్విచక్ర వాహనంపై భద్రాచలం వెళ్తున్నారు. అదే సమయంలో భద్రాచలం నుంచి నెల్లిపాక వైపు వస్తున్న కారు రాయనపేట వద్ద జాతీయ రహదారిపై ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో భద్రాచలం తరలించగా పరిస్థితి విషమించి రాఘవాపురం గ్రామానికి చెందిన నరేంద్ర(18) మరణించాడు. నల్లకుంటకు చెందిన రాజేష్‌కు రెండు కాళ్లు విరగటంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరూ వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటారు. కారును పట్టుకుని ఎటపాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. కేశవస్వామివారి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న పండితులు

చోడవరం : రమణీయం..కమనీయం...కేశవస్వామివారి కల్యాణం. శ్రీదేవి,భూదేవి సమేతుడైన కేశవస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి 751వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వారం పాటు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా స్వామివారి కల్యాణం బుధవారం అర్ధరాత్రి అంగరంగవైభవంగా జరిగింది. భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం పెళ్లిసందడి నెలకొంది. ప్రత్యేకంగా రకరకాల పండ్లు, పూలతో అలంకరించిన కల్యాణ మండపంలో శ్రీదేవి,భూదేవి సమేతుడైన కేశవస్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా కల్యాణాన్ని జరిపారు. ఆస్థాన అర్చకులైన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణం జరిపించారు.

అబ్బురపరిచిన 'మిలాన్'



సాంకేతిక ప్రదర్శనలో పలు రక్షణ ఉత్పత్తి సంస్థల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

- మిలాన్ విలేజ్, సాంకేతిక ప్రదర్శనను ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- రక్షణ రంగ ఆవిష్కరణల స్టాల్స్ సందర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

విశాఖ సిటీ: అనేక దేశాల సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో హస్త కళలు.. వస్త్రాలు.. వంటకాలు.. దేశ రక్షణ రంగ సత్తాను చాటేలా అధునాతన యుద్ధ సామగ్రి.. మిస్సైల్స్.. టార్పిడోలు.. డ్రోన్లు.. కనులవిందు చేసే సాంస్కృతిక ప్రదర్శనలు.. ఇలా అనేక ప్రత్యేకతలతో మిలాన్-2024 ప్రదర్శన 58 దేశాల నావికాదళాలకు చెందిన అధికారులు, ప్రతినిధులను మంత్రముగ్ధులను చేసింది. ఒకవైపు మిలాన్ విలేజ్.. మరోవైపు రక్షణ రంగ సంస్థల ఆవిష్కరణల ప్రదర్శనను భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఐఎన్ఎస్ శాతవాహనలో ప్రారంభించారు. ముందుగా ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) సహకారంతో నిర్వహించిన మారిటైం సాంకేతిక ప్రదర్శనను కేంద్ర మంత్రి తిలకించారు. డీఆర్‌డీఓ, భారత్ డైనమిక్స్, ఇలా రక్షణ రంగ సంస్థల ఆవిష్కరణలు, వాటి విశిష్టతలను తెలుసుకున్నారు. అనంతరం మిలాన్ విలేజ్‌లో ఇండోనేషియా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్, వియత్నాం ఇలా పలు దేశాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అక్కడి వారి సంప్రదాయ దుస్తులు, హస్తకళలను పరిశీలించారు.

ఆకట్టుకున్న ఆవిష్కరణలు

మిలాన్ విలేజ్ సంప్రదాయాలకు అద్దం పట్టగా.. మారిటైం సాంకేతిక ప్రదర్శన అందరినీ అబ్బురపరిచింది. ఒకవైపు వందల కిలోమీటర్ల దూరం నుంచి శత్రుదేశాల స్థావరాలను తుత్తునీయలు చేసే మిసైల్స్.. మరోవైపు శత్రువుల మిస్సైల్స్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే యాంటీ మిస్సైల్స్ సిస్టమ్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. అలాగే భారత్ డైనమిక్స్, ఎల్ అండ్ టీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ సంస్థలతో పాటు డిఫెన్స్ రంగంలో స్టార్టప్ సంస్థలు సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్, దక్షా అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ లిమిటెడ్, సైఫ్ ఆటోమేషన్ లిమిటెడ్ ఆవిష్కరణలు భారత రక్షణ రంగ సామర్థ్యాన్ని తేటతెల్లం చేశాయి. 58 దేశాలకు చెందిన నావికాదళాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రదర్శనను తిలకించారు. ఈ ప్రదర్శన 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మిలాన్ ప్రదర్శనకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధుల కోసం కొనసాగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



సాంస్కృతిక ప్రదర్శన